
# ముహూర్తబలం



అప్పటికి అరగంట నుంచీ నిలబడిన నేను అసహనంగా పరిసరాలు పరికిస్తున్నాను. ఆయన నన్ను చూసినా కూర్చోమని అనలేదు. ఆయన కోపం నాకు తెలుసు. అయినా అవసరం నాది.

ఆయన పని పూర్తయినట్టుంది. తాపీగా పడక కుర్చీలో వెనక్కు వాలుతూ అన్నారు వ్యంగ్యంగా.

"ఏంట్రోయ్! దారి తప్పి వచ్చావు. నాతో ఏదైనా పని పడిందా?"

"అవును మామయ్యగారు! మా అమ్మాయి..." నా మాట పూర్తికాకుండానే ఆయనే అన్నారు.

"నాన్నా అమ్మా బాగున్నారా? తమ్ముడి దగ్గరకు వెళ్ళారట కదా! ఉత్తరాలు వ్రాస్తున్నారా!"

"అవునండీ. మిమ్మల్ని అడిగి నట్లు చెప్పమని కూడా ఉత్తరంలో వ్రాసారు" అబద్ధమాడాను.

"ఆహా! అలాగా! నన్ను అడిగినట్లు చెప్పమని నీకు ఉత్తరంలో వ్రాస్తే మరి నాకు ఉత్తరం వ్రాయడం ఎందుకు డబ్బు దండగ?"

షాకయ్యాను. దొరికిపోయాను.

"అబద్దాలు నా దగ్గర ఎందు కురా ప్రసాద్. ఈ వేళ నువ్వు ఈ సమయా నికి పలానా పనిమీద వస్తున్నావని, తన మొహం చూసి నీకు సాయం చేయమని మీ నాన్నగారు నాకు ఉత్తరం వ్రాసారు. నీకు మాలాంటివారి ఇళ్ళకు రావడం పడదు. ఏదైనా సాయం చేయడానికి టైం వుండదు. కానీ మీరొచ్చిన వెంటనే మీ పని చేసిపెట్టాలి. అహా... అవకాశం వచ్చిందికదా అని దెప్పుతున్నాను అనుకోకు బాబూ. ఇప్పుడు చెప్పు ఏమిటి నీ పని"?

అనవలసిన మాటలన్నీ అనేసిన ఆయన ముఖం చూస్తే, బాణం తగిలి విలవిల లాడుతున్న పావురాన్ని పాశవిక ఆనందంతో పరిశీలిస్తున్న భావం గోచరించింది నాకు. అయినా తప్పదు. నా పని అలాంటిది.

"మా అమ్మాయి డిగ్రీ సెకండియర్ చదువుతోంది. ఇప్పటినుంచి చూస్తేగానీ సంబంధం కుదరదు. అందుచేత దాని జాతకం మీచేత వ్రాయిద్దామని...." నసిగాను.

"మీ నాన్నగారు పంపగా వచ్చావు. అంతేనా!" ఆయన లేచి చుట్ట వెలిగించి పచార్లు చేస్తూ దీర్ఘాలోచనలో పడ్డారు.

"అదికాదు మామయ్యగారూ. మీరు నిత్యమూ చేసే పూజలకి హాజరై అందరికీ వడ్డించడంలో సాయం చేయాలని నాకు ఎంతగానో వుంటుంది. అయితే

వృత్తిధర్మం..."

"చాల్లేరా. నాకేం తెలియనట్లు చెబుతావేం? నువ్వు సంపాదించే సంపాదనలో పాతిక రూపాయలతో ఓ దండ కొనుక్కొచ్చి అమ్మవారికి వేసేంత తీరిక లేకపోయిందట్రా? మీ నాన్నగారికి నేనంటే ఎంత అభిమానం! ఏమీ లేకుండా ఈ ఊరు వచ్చిన మమ్మల్ని సొంత ఇల్లు కలవారిలా చేసి మేమింత వృద్ధిలోకి రావడానికి కారణం మీరు" అంటూ అనుక్షణం నన్ను ఆయన తలుస్తుంటారే! ఆ కృతజ్ఞతలో ఆవగింజంత అయినా ఉందా నీకు? హు... అయితే నీకు నిక్కచ్చిగా చెబుతున్నాను. నేను వ్రాసే జాతకం మీద నీకు నమ్మకం పూర్తిగా ఉంటేనే వ్రాసి ఇస్తాను. ఒకవేళ తరువాత ఏదన్నా జరగకూడనిది జరిగిందనుకో. అయ్యో! 'అనవసరంగా నాకిష్టంలేనివాళ్ళ దగ్గరకి వెళ్ళి జాతకం వ్రాయించానే' అని నువ్వు బాధపడితే మాత్రం బాగుండదు. సరేనా!" అన్నారాయన.

"అయ్యో ఎంతమాట? పెద్దమనసు చేసుకొని మీరు ఒప్పుకోవడమే మా అదృష్టం మామయ్యగారు. నావల్ల తప్పులుంటే మనస్ఫూర్తిగా క్షమించండి. మా ఇంట్లో సమస్త శుభకార్యాలు మీరు పెట్టిన ముహూర్తబలంతోనే జరిగాయి. అందరమూ సుఖంగా ఉన్నాం. మాచేత వేయించే గవ్వలలో ఒక్క గవ్వ తిరగబడితే చాలు మాకు అపశృతి జరగడానికి. అనుక్షణం మా మంచి కోరే మనసు మీదని నాకు తెలుసు. మీరన్నట్లు నాన్నగారు దైవాన్ని స్మరించడం మర్చిపోతారేమోగాని మిమ్మల్ని రోజుకోసారి అయినా స్మరించడం మాత్రం మానరు. అందుచేత ఈ కార్యం మీవల్లనే అవుతుందన్న నమ్మకంతో ఇక్కడకు వచ్చాను. దయచేసి ఈ పని మనస్ఫూర్తిగా చేసి పెట్టండి. మీ ఆశీర్వాదం వల్ల నాబిడ్డ సుఖంగా ఉంటే అంతకన్నా మాకు ఏం కావాలి?"

"ఆ మాత్రం విశ్వాసం నామీద వుంటే అదే చాలు. ఇకనైనా అప్పుడప్పుడు వచ్చి కనిపిస్తుండు."

నా మనసు కుదుటపడింది. అమ్మయ్య... అనుకుని జేబులోంచి వందనోటు తీసి ఆయన ముందు వుంచి అన్నాను. "ఇది వుంచండి మామయ్యగారూ!"

అంతే! ఆయన కయ్యిమని లేచారు.

"మూర్ఖుడా! నేను... మీ నాన్నగారు చెప్పాక కూడా డబ్బు తీసుకునే రకమనుకున్నావా? ముందది తీసి చేత్తో పట్టుకో" హుంకరించారాయన.

'జేబులో పెట్టు' అనలేదాయన. 'చేత్తో పట్టుకో' అన్నారు అంటే నాకు అర్థమయింది. మరో వంద, బల్లమీద పెట్టిన వంద కూడా తీసి "అమ్మవారి పూజ నిమిత్తం ఉపయోగించండి మామయ్యగారు" అన్నాను.

"అయితే కాళ్ళు చేతులు కడుక్కుని వెళ్లి లోపల అమ్మవారి హుండీలో వేసిరా."

"నేను నూతి దగ్గరకు వెళ్ళి కాళ్ళూ, చేతులు కడుక్కుని అమ్మవారి గదిలోకి వెళ్ళాను. నిజమైన దేవాలయాన్ని తలపిస్తోంది ఆ గది.

రాజరాజేశ్వరిదేవి రూపంలో దుర్గామాత వెండి మండపంలో మకర తోరణాల మధ్య వెండి ప్రమిదల దీపాల కాంతులలో తన సహజ తేజస్సును ప్రసరిస్తూ ప్రకాశిస్తోంది.

ఆ గది పై కప్పుకు తగిలేలా రోజ్‌వుడ్‌తో తయారుచేసిన దేవతా మండపంలో ప్రతి వస్తువూ తమ పవిత్రతను చాటుతున్నాయి. నిత్య కుంకుమార్చన, అభిషేకం అన్నీ పూర్తయిన చిహ్నాలు కనిపిస్తున్నాయి. సుగంధ పరిమళాలు, సాంబ్రాణి ధూప సువాసనలు మిళితమైన ఆ గదిలోకి అడుగుపెట్టే ప్రతీవ్యక్తి నమస్కరించుకునేలా అక్కడి వాతావరణం వుంది.

నేను అమ్మవారి కుంకుమ తీసి బొట్టు పెట్టుకొని రెండువందలు ప్రక్కనే వున్న హుండీలోవేసి మనస్ఫూర్తిగా నమస్కరించుకున్నాను. 'నా బిడ్డకు మంచి సంబంధం కుదిరేలా చేయమని.'

నమస్కరించుకున్న ఆ క్షణం 'ముహూర్తబలం' విలువ నా కోరిక నిజమైననాడుగానీ తెలియలేదు.

ఆయన వ్రాసి నాకు అందజేసిన మా అమ్మాయి జాతకం వల్ల ఆమెకు తగిన వరుడు దొరికాడు.

★★★

దీక్షితులు మామయ్యగారితో మా కుటుంబ పరిచయం ఈ నాటిదికాదు. ఇరవై అయిదు సంవత్సరాల క్రితంది. ఆ రోజుల్లో అన్నయ్యకు టైఫాయిడ్ వచ్చి నలభై లంఖణాలు చేశాక సంధి ప్రేలాపనలోకి దిగితే దీక్షితులు మామయ్యగారు చేసిన పూజా ఫలితమే అన్నయ్య తిరిగి మాకు దక్కడం. అందులో అన్నయ్య వెన్నపూస వంటి మనసు కలవాడని, వాడినుంచి ఎలాంటి సహాయమైనా అడిగిన వెంటనే పొందవచ్చని అనుకున్నారేమో దీక్షితులు గారు. వాడికి దగ్గరలో ఉపనయన ముహూర్తం పెట్టేసి అత్యంత ఘనంగా ఆయన చేయించిన తీరుకి నాన్నగారి దృష్టిలో ఇహలోకపు దేవుడిగా మిగిలి పోయారు. ఆ కృతజ్ఞత అన్నయ్యకు కూడా పుష్కలంగా వుంది.

మా ఊరిలో దేవీ నవరాత్రులు ఆయన నిర్వహించినంత ఘనంగా ఏ సంఘమూ నిర్వహించలేదు. ఆ తొమ్మిది రోజులూ పూజలు, నిత్య పారాయణాలు, అభిషేకాలు, కుంకుమార్చనలు, భజనలతో వారి ఇల్లు మరో విజయవాడలా వెలిగి పోతుంది.

వేద వేదాంగాలు ఔపోసనపట్టి నిత్యము మూడుపూటలా గాయత్రీ మంత్రం జపించే ఆయన, అమ్మవారిని నిలబెట్టిన మొదట రోజు మొదటి దండ అన్నయ్యచేతే వేయి స్తారు. ఊరిలో ఎంతోమంది మోతుబరులు, డబ్బున్నవారు ఉన్నా, వేలకువేలు అమ్మవారికి కానుకలుగా సమర్పించినా, అన్నయ్యపట్ల ఆయనకున్న అభిమానం, నమ్మకం, వాడికి అంతటి విలువను ఆపాదించిపెట్టాయి.

ఆ తొమ్మిదిరోజులూ అన్నయ్య సెలవు పెట్టి తన ఫ్యామిలీతో వచ్చి వారి ఇంట్లోనే వుండి స్వంత మనుషుల మాదిరిగా సేవచేసి వెళ్తారు. అంటే ఆయనకు కొడుకు లేక కాదు. ఉండీ లేనివాడు.

వివాహమైన తరువాత ఆయన కొడుకును కోడలు తనతో తీసుకుపోయింది. భార్యపట్ల విధేయత కలిగిన అతడు తల్లిదండ్రులను పూర్తిగా విస్మరించడమే అన్నయ్యను అంత దగ్గరకు చేరదీయడానికి కారణం.

అటువంటి నిత్యాగ్ని హోత్రావధానికి నేనంటే కోపం రావడానికి కూడా కారణం ఉంది.

అవి నేను ఉద్యోగం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న రోజులు. జిల్లా పరిషత్ ఛైర్మన్‌కి దీక్షితులు మావయ్యగారే గురువుగారు. తాను గెలుపొందినది తన గురువుగారు పెట్టిన ముహూర్తానికి నామినేషన్ వేయడంవల్లనే. అని ఆయన దృఢ విశ్వాసం. ఆయనకు మామయ్యగారి మాటంటే వేదవాక్కు.

అంతక్రితం ఏదో ఒక సందర్భంలో నాన్నగారు "మావాడికి మీరు మాట సాయం చేయాలి" అన్నారు.

దానికి ఆయన "వాడిని అప్లికేషన్ పెట్టేటప్పుడు నాతో చెప్పమనండి" అన్నారు హేళనగా నన్ను ఎగాదిగా చూసి.

డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటి ప్రకటన పేపర్‌లో చూశాక అప్లికేషన్ పెట్టాను. వ్రాతపరీక్ష పూర్తయి ఇంటర్వ్యూకి హాజరు కావలసిందిగా కాల్ లెటర్ వచ్చింది. ఆనందోత్సాహాలతో నాన్నగారు, నేను ఆ లెటరుతో ఆయనవద్దకు వెళ్లాం. సాయంసంధ్యకు గాయత్రీ జపానికి సిద్ధమవుతున్న ఆయనకి నాన్నగారు విషయం చెప్పారు.

ఆయనకు తీవ్రమైన కోపం వచ్చింది. అంత కోపం ఎందుకు వచ్చిందో నాకు అర్థం కాలేదు.

"శాస్త్రి గారూ! మీరు ప్రతిదానికీ వాడిని వెంటపెట్టుకుని వస్తారేంటి? ఇప్పుడు నేను వాడితో మాట్లాడతాను. మీరు మౌనంగా వినండి. మధ్యలో మాట్లాడవద్దు" శాసిస్తున్నట్లు అన్నారాయన.

నాన్నగారు ఏదో చెప్పబోయి ఆగిపోయారు.

నేను ముందుకు వెళ్లి కాల్ లెటర్ అందించాను.

దాన్ని నా ముఖాన విసిరి కొట్టారాయన. నాకు రక్తం ఉడికిపోయింది. అతి బలవంతంగా వేళ్ళు లెక్కపెట్టుకున్నాను కోపం నిగ్రహించుకోవడం కోసం.

"ఏరా! ఇదివరకు నువ్వు వచ్చినప్పుడు ఏం చెప్పాను? అప్లికేషన్ పెట్టేటప్పుడు నాతో చెప్పమన్నానా?"

"చెప్పమన్నారు."

"మరి నాతో చెప్పావా?"

"లేదండీ!"

"మరి ఈ వేళ కాల్ లెటర్ తీసుకొని నా దగ్గరకు వచ్చావంటే ఏమిటి అర్థం? 'నేను వ్రాత పరీక్ష పాసయ్యాను. అదంతా నా ప్రతిభే. మీరు కేవలం ఒక్కమాట వేసేస్తే చాలు జాబ్ వచ్చేస్తుంది' అనే నిర్లక్ష్యమే కదా!"

"అది కాదు సార్."

"నాకు ఇంకేమీ చెప్పొద్దు. నీ స్వంత ప్రతిభతో పరీక్ష పాసయినట్టే మగాడివైతే జాబ్ కూడా ఎటువంటి రికమెండేషన్ లేకుండా సంపాదించు. నాకు టైమైంది సంధ్య వార్చుకోవడానికి. ఇంక మీరు వెళ్ళవచ్చు."

చెప్పు పుచ్చుకుని కొట్టినట్టు చెప్పిన ఆయన సమాధానానికి మనసు మండి పోతుండగా బయటకు వచ్చేసాను నాన్న గారితో.

నాకు ఆత్మాభిమానం చాలా ఎక్కువ. ఆ రాత్రంతా వెక్కి వెక్కి ఏడ్చాను. నా తప్పులేకుండా ఆయన చేసిన ఆ అవమానం జన్మలో మరచిపోలేను. అందుకే ఆయనకి దూరంగా వుండేవాడ్ని.

స్వయంశక్తితోనే ఉద్యోగం సంపాదించుకున్నాను. మెరిట్‌లో నెంబర్ వన్‌గా సెలక్టయ్యాను. అయితే ఆయన దగ్గరకు వెళ్లి ఉద్యోగం వచ్చింది అని చెప్పలేదు. నాన్నగారే చెప్పుకున్నారు.

అటు తరువాత ఆయన ఎప్పుడైనా ఎదురుపడితే తప్పనిసరై ఒక నమస్కార బాణం వదిలేవాడిని. ఆయన నిర్లక్ష్యంగా తలెగరేసి వెళ్లిపోయేవాడు.

మళ్ళీ ఈనాడు నా అవసరం కోసం ఆయన ఇంటికి వెళ్ళడమే!

★★★

"శ్రీ ప్రసాద్ గారికి,

నమస్కారములు. మీ కుటుంబ గౌరవం, సాంప్రదాయాలు అన్నీ మాకు నచ్చాయి. అయితే మా అబ్బాయి జాతకంతో మీ అమ్మాయి జాతకం ఏ మాత్రమూ సరిపోలేదు. మీ అమ్మాయి జాతకంలో కుజదోషం ఉందట! మీ అమ్మాయికి ఈ విషయం తెలిసే చెప్పలేదో, నిజంగా మీకు తెలియదో మాకు తెలియదుగానీ మీ సంబంధం వదులు కుంటున్నామని తెలియజేయడానికి విచారిస్తున్నాము. నమస్తే."

మగపెళ్ళివారి నుండి వచ్చిన ఉత్తరం చూసి నేను, పద్మ షాకయ్యాము.

'మా అమ్మాయికి కుజదోషం వుంది' అన్న విషయాన్ని నేను, అయితే అంత తేలిగ్గా తీసుకోలేకపోయాం. మా తమ్ముడి గారింట్లో హైదరాబాద్‌లో ఉండి చదువు కుంటున్న తనని హడావుడిగా టెలిగ్రాం ఇప్పించి రప్పించాను పెళ్లిచూపుల కోసం. నా కూతురని చెప్పడం కాదుగానీ అశ్విని అన్నింటిలోనూ చలాకీగా ఉండే ఫస్ట్‌గ్రేడ్ అమ్మాయి. అతి సున్నితమైన మనస్తత్వం. తనకీ విషయం తెలిస్తే చాలా బాధపడుతుంది.

నా భార్య వారిస్తున్నా వినకుండా ఎందుకైనా మంచిదని కంప్యూటర్ జాతకం వ్రాయించాను. మరో పండితుడిచేత రాయించాను. నా అనుమానం నిజమైంది. అశ్వనికి కుజదోషం లేదు. సరిగ్గా ఆరోజే నేనూహించని ఉత్తరం శుభలేఖతో సమానమైన వార్తను మోసుకొచ్చింది.

★★★

"శ్రీ ప్రసాద్‌గారికి.

శ్రీనివాసరావు నమస్కారాలు. నేను దీక్షితులుగారి అబ్బాయిని. మనం కలుసుకుని చాలా కాలమైంది. నా వివాహం కాకముందు అప్పుడప్పుడు మీ ఇంటికి వస్తుండేవాడిని. మా అబ్బాయి కంప్యూటర్ సాఫ్టవేర్ ఇంజనీరుగా పని చేస్తున్నాడు. ఆధునిక భావాలున్నవాడు. ప్రేమించింది మీ అమ్మాయిని అని తెలుసుకున్న నాకు ఆశ్చర్యంతోపాటు ఆనందం కలిగాయి. మా నాన్నగారికి తన వారసుడుగా నేను ఆయన

విద్య అభ్యసించలేదని కోపం. ఆ విధంగా ఆయన నన్ను దూరం చేసుకుంటూనే వున్నా నా బాధ్యతగా ప్రతి ఉత్తరంలోనూ వారిని నావద్దకు వచ్చేయమని కోరుతూనే వున్నాను. కానీ ఆయన పద్ధతిలో మాత్రం ఏమాత్రం మార్పులేదు. నా ఉత్తరానికి ఏనాడూ ఆయన సమాధానం వ్రాయరు.

అందుచేత ఈసారి, వియ్యంకులు కాబోతున్న మీరు ఈ విషయాన్ని ఆయనకి తెలియజేస్తారని ఆశిస్తూ, ఆయనకు కూడా విడిగా వ్రాసి ఈ కవరు లోనే వుంచిన రెండవ లెటర్ అందజేయు వలసిందిగా కోరుతున్నాను. ఈ లెటర్నే టెలిగ్రామ్‌లా భావించి మీ దంపతులు బయలుదేరి వస్తే అన్ని విషయాలూ మాట్లాడుకుందాం. మీ అమ్మాయిని మేము చూసాం. మాకు అన్నివిధాలా నచ్చింది. మా అబ్బాయి అభిప్రాయం కాదనే ధైర్యం మాకులేదు. పూర్తిగా వాడిష్టమే మా ఇష్టం. మీ రాకకోసం ఎదురుచూస్తూ -

శ్రీనివాసరావు"

మా ఆనందానికి అవధుల్లేవు.

రెండవ ఉత్తరం విప్పాను. అందులో ఇలా వుంది.

"పూజ్యులైన నాన్నగారికి,

నమస్కరంచి మీ కొడుకు, కోడలు వ్రాయునది. ఇక్కడ మేం క్షేమం. మీరు ఆరోగ్యంగా ఉన్నారని తలుస్తాను. మీ మనవడి వివాహం నిశ్చయం చేశాము. అతి తక్కువ సమయం ఉండడం వలన మీదగ్గరకు వచ్చి సలహా తీసుకునే సమయం లేకపోయింది. అమ్మాయి ఎవరోకాదు, మీకు అత్యంత ఆప్తులైన శాస్త్రిగారి మనుమరాలు. వారి రెండవ అబ్బాయి మన ఊరిలోనే టీచర్‌గా పనిచేస్తున్నారు. నా తరపున మీరెలాగూ రారని మీ పట్టుదల తెలిసిన నేను ఆడపెళ్ళివారి తరపునైనా వివాహానికి వచ్చి మీ మనవడిని, అతని భార్యని ఆశీర్వదిస్తారని కోరుతున్నాను. హృదయపూర్వక నమస్కృతులతో -

మీ కొడుకు, కోడలు."

ఉత్తరం పూర్తిచేసిన నా పెదవుల పైన, అందరినీ కుట్టి బాధించే తేనెటీగను సూదులతో గుచ్చి ఆనందం పొందితే కదలా మందహాసం వెల్లివిరిసింది. కావాలని కుజ దోషం ఆపాదిస్తూ [illegible] ఇచ్చిన జాతకం ఆయనకే తిప్పి కొట్టిందన్న కసితో ఆ ఉత్తరం చదివాక దీక్షితులు గారి రూపాన్ని ఊహించు కుంటూ దానిని తీసుకుని వారి ఇంటివైపు నడిచాను. ●

'ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక'
10-02-2000